

హస్తినాపురం జీఎస్‌ఆర్ గార్డెన్ వద్ద సుధీర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అభిమానులు

బీఆర్ఎస్ సంబురాలు

- ప్రజల ఆదరాభిమానాలే తిరిగి గెలిపించాయి: సుధీర్‌రెడ్డి



సుధీర్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న నల్లా రఘుమారెడ్డి



సుధీర్‌రెడ్డి దంపతులకు బీఆర్ఎస్ నేతల శుభాకాంక్షలు...



మన్సూరాబాద్ చౌరస్తాలో సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యేగా తిరిగి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం రోడ్డులోని జీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఆదివారం విజయోత్సవ సభ నిర్వహించారు. సభలో పాల్గొన్న సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, తాను చేసిన అభివృద్ధి, ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలే తనను తిరిగి గెలిపించాయని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.



చంపాపేట గాంధీ విగ్రహ చౌరస్తాలో ...



లింగోజిగూడ చౌరస్తాలో శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో..

శ్రీకాంతాచారికి నివాళి



తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆదివారం ఎల్‌బీనగర్‌లోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి.

– మన్సూరాబాద్

'సోనియమ్మ రుణం తీర్చుకున్నారు'



సైదాబాద్‌లో.. సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు మదన్‌బాబు తదితరులు



మూసారంబాగ్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో...

సైదాబాద్: తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రసాదించిన ఏఐసీసీ నాయకురాలు సోనియా గాంధీ రుణాన్ని ఈ ఎన్నికల్లో తీర్చుకున్నారని మలక్‌పేట నియోజకవర్గ బీ బ్లాక్ అధ్యక్షుడు మదన్‌బాబు అన్నారు. ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీ సాధించడంతో ఆదివారం సాయంత్రం సైదాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం చౌరస్తాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ప్రజాపాలన అందించడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని నమ్మిన ప్రజలు పార్టీకి పట్టం కట్టారన్నారు.

గడ్డిఅన్నారంలో..

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారంలో యూత్ కాంగ్రెస్ నేత సంఘిరెడ్డి ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ హాజరయ్యారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సోహెల్ ఆధ్వర్యంలో మూసారంబాగ్‌లో విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. మలక్‌పేట అధ్యక్షుడు ఫైజల్, ముజామిల్, ఖలీద్, ముజీబ్, అమీర్, ఇస్మాయిల్, నౌమన్, వరుణ్ పాల్గొన్నారు.



గడ్డిఅన్నారంలో సంబురాలు జరుపుకుంటున్న బొల్లు కిషన్, సంఘిరెడ్డి తదితరులు

ఫలించిన అభివృద్ధి మంత్రం!

- ఎల్బీనగర్ నుంచి మళ్లీ గెలిచిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- మూడోసారి ఎమ్మెల్యేగా విజయం



చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎన్నికల ఫలితాల్లో ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజయం సాధించారు. గతంలో రెండుసార్లు కాంగ్రెస్ నుంచి గెలుపొందిన సుధీర్‌రెడ్డి అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచి గెలుపొందడం.. మొదటిసారి ఎల్‌బీనగర్‌లో బీఆర్ఎస్ విజయం సాధించినట్లయింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఇక్కడ మొదటిసారి బీఆర్ఎస్ గెలుపొందినప్పటికీ.. రాష్ట్రంలో ఆపార్టీ అధికారం కోల్పోవడం గమనార్హం. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తనను తప్పక గెలిపిస్తారనే ధీమాతో సుధీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 'ఎల్బీనగర్ ఐదేళ్లకు ముందు ఎలా ఉండేది.. ఇప్పుడు ఎలావుందో చూడండి' అంటూ ఆయన చేసిన ప్రచారం సత్ఫలితాలు ఇచ్చాయని చెప్పవచ్చు. ఎమ్మెల్యేగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండటం, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, వ్యక్తిగతంగా ఆయనకున్న ఇమేజ్ తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు దోహదపడ్డాయి.

పది మంది కార్పొరేటర్లు ఉన్నా.. బీజేపీ ఓటమి ..

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఒక్క డివిజన్ తప్ప.. 10 మంది కార్పొరేటర్లు గెలుపొందినప్పటికీ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి ఓటమి పాలు కావటం గమనార్హం. క్షేత్ర స్థాయిలో బీజేపీ కార్పొరేటర్లు అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల్లో అభిమానాన్ని చూరగొనలేక పోవటం, డివిజన్ల అభివృద్ధిని కార్పొరేటర్లు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సామ రంగారెడ్డి ఓటమికి కారణంగా పలువురు భావిస్తున్నారు. 21 రౌండ్లలో నాలుగో రౌండ్‌లో మాత్రమే సామ రంగారెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల కంటే ఎక్కువ ఓట్లు సాధించారు. మిగతా ఏ రౌండ్‌లోనూ మెజారిటీ సాధించలేదు.

మధుయాష్కీకి అన్ని రౌండ్లలో మెజారిటీ నిల్...

మొత్తం 21 రౌండ్లలో ఎన్నికల కౌంటింగ్ జరగ్గా... ఒక్క రౌండ్‌లో కూడా కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ మెజారిటీ సాధించలేక పోయారు. బీసీ కార్డు, కుల సమీకరణతో గెలుపొందుతాననే నమ్మకంతో ఎల్‌బీనగర్ బరిలో దిగిన మధుయాష్కీకి ఇక్కడి ప్రజలు పట్టం కట్టలేదు. ఆయన 3వ స్థానానికే పరిమితం కావాల్సి వచ్చింది.

నా విజయం ఎల్‌బీనగర్ ప్రజలకు అంకితం

దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, చైతన్యపురి: తన విజయం ఎల్‌బీనగర్ ప్రజలకు అంకితమని ఎమ్మెల్యేగా మరోసారి గెలుపొందిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో తాను విజయం సాధించటం చాలా సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రజలకు ఏమీ చేయలేరని తెలుసుకున్న ప్రజలు తనను గెలిపించారన్నారు. ఎన్నికల ప్రచారంలో వారు వ్యక్తిగత విమర్శలకే పరిమితమయ్యారని, ఎలాంటి అభివృద్ధి చేస్తామనేది చెప్పలేదని విమర్శించారు. ఎల్‌బీనగర్‌ను అభివృద్ధి నావల్లే సాధ్యం అవుతుందని తనకు పట్టం కట్టారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును వమ్ము చేయకుండా మరింత విశ్వాసంతో ఎల్‌బీనగర్‌ను అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెడతానని సుధీర్‌రెడ్డి అన్నారు. 45 రోజులుగా నిద్రాహారాలు మాని తనతో పాటు ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్‌బీనగర్ రిటర్నింగ్ అధికారి పంకజ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందినట్టు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి

సుధీర్‌రెడ్డికి 22,314 ఓట్ల ఆధిక్యం

చైతన్యపురి: ఎల్‌బీనగర్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజయం సాధించారు. 22,314 ఓట్ల ఆధిక్యంతో సమీప బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డిపై గెలుపొందారు. ఇక్కడ పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌కు మూడవ స్థానం దక్కింది. 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగ్గా ఒక్క నాలుగో రౌండ్ మినహా 20 రౌండ్లలో దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముందంజలో ఉండి చివరకు విజేతగా నిలిచారు.

అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు...

పేరు: దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
పార్టీ– భారతీయ రాష్ట్ర సమితి
సాధించిన ఓటు–1,11,197
బీఆర్ఎస్ మెజారిటీ–22,314



పేరు: మధుయాష్కీగౌడ్
పార్టీ– కాంగ్రెస్
సాధించిన ఓట్లు 83,157



పేరు: సామ రంగారెడ్డి
పార్టీ– భారతీయ జనతా పార్టీ
సాధించిన ఓట్లు– 88,883



భారీ బందోబస్తు నడుమ కౌంటింగ్



కౌంటింగ్ కేంద్రం బయట సీపీ డీఎస్ చౌహాన్, డీసీపీ సాయిశ్రీ

చైతన్యపురి: ఎన్నికలు కౌంటింగ్ జరిగిన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. పాస్‌లు ఉన్న కౌంటింగ్ ఏజంట్లు, మీడియా ప్రతినిధులను తప్ప ఎవరినీ కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించ లేదు. రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ ఇండోర్ స్టేడియం సందర్శించి బందోబస్తు పరిశీలించారు. డివిజన్ పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.

మజ్లిస్ సిగలో మరోసారి మలక్‌పేట

- నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన అహ్మద్ బలాల
- కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్‌పై 26,093 ఓట్ల మెజారిటీతో గెలుపు



విజయం సాధించిన అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



సమీప ప్రత్యర్థి షేక్ అక్బర్ (కాంగ్రెస్)



విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట/దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ బలాల విజయకేతనం ఎగురవేశారు. గతంలో పలువురు రెండు పర్యాయాలు గెలుపొందిన సందర్భాలున్నాయి. బలాల నాలుగోసారి విజయం సాధించి అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. ఆదివారం వెలుబడిన ఫలితాలలో బలాలకు 55,609 ఓట్లు రాగా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్‌పై 26,093 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2009లో తొలిసారి 8,371 ఓట్లతో విజయం సాధించిన బలాల, 2014లో బీజేపీ అభ్యర్థి వెంకట్‌రెడ్డిపై 23, 263 ఓట్ల మెజారిటీ సంపాదించారు. 2018 ఎన్నికల్లో 23,512 ఓట్లతో టీడీపీ అభ్యర్థి ముజఫర్ అలీఖాన్‌ను ఓడించారు. మొదటి నుంచి బలాల తన ఆధిక్యతను పెంచుకున్నారు. ఈ ఎన్నికల్లో 23,535 ఓట్లతో బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి మూడో స్థానానికి పరిమితం కాగా, బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి 18,583 ఓట్లతో నాలుగోస్థానంలో నిలిచారు. ఇండిపెండెంట్ అభ్యర్థి హన్మంతరావుకు 640 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి అలగోల రమేష్‌కు 453 ఓట్లు రాగా.. వారికంటే ఎక్కువగా 876 ఓట్లు నోటాకు పడ్డాయి.

అంబర్‌పేట డీఆర్‌సీ సెంటర్ వద్ద సందడి

ఎన్నికల్లో మజ్లిస్ గెలుపుతో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున అంబర్‌పేట ఇండోర్ స్టేడియం డీఆర్‌సీ సెంటర్‌కు చేరుకున్నారు. పూర్తి ఫలితాలు వెలువడే వరకు బలాల కౌటింగ్ సెంటర్‌లో ఉన్నారు. అధికారులు మజ్లిస్ గెలుపు ప్రకటించగా బలాల గెలుపు ధ్రువీకరణ పత్రం తీసుకుని బయటికి రాగా.. కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్టేడియం మైదానంలో బలాల నేలపై మోకరించి అల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. అక్కడ నుంచి మలక్‌పేట మీదుగా చార్మినార్ పంజేషాహ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవున బాణసంచా కాల్చుతూ మజ్లిస్ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. జరుపుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఓట్ల లెక్కింపు

ఎన్నికలతో పాటు లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి నిరంతరం విధులు నిర్వహిస్తున్న అధికారులు పోలీసులు ప్రశాంతంగా ముగిసిన ఓట్ల లెక్కింపుతో ఉత్సాహం వ్యక్తం చేశారు.

మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తా

నాపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన మలక్‌పేట ప్రజలకు కృతజ్ఞతలు. 15 సంవత్సరాలుగా మలక్‌పేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేశా. అభివృద్ధిని కొనసాగించడానికి ప్రజలు మరోసారి అవకాశం కల్పించారు. నా గెలుపు కోసం అహర్నిషలు కష్టపడి పని చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు.

– అహ్మద్‌బలాల



ఓల్డ్‌మలక్‌పేటలో స్వీట్లు పంచుతున్న నాయకులు

'కుటుంబ పాలన పోయింది'

చాదర్‌ఘాట్: ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. పార్టీ నాయకులు కొమిరెల్లి రాజశేఖరరెడ్డి, బాబు శ్రీనివాస్ డివిజన్ ప్రజలకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో కుటుంబ పాలన పోయి ఇక నుంచి ప్రజాపాలన మొదలవుతుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విష్ణుదేవ్, రాజేంద్ర యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో....

రంగారెడ్డి కోర్టులు: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మెజారిటీ రావడంతో రంగారెడ్డి జిల్లా కోర్టుల గేటు ముందు టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ రావుల చెన్నా రెడ్డి బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకులు బాచి రెడ్డి శాయి రెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గని గెలుపుపై హర్షం వ్యక్తం చేశారు.

మహేశ్వరంలో సబితమ్మ మూడోసారి విజయం

- సమీప అభ్యర్థి శ్రీరాములు యాదవ్‌పై 26,320 ఓట్ల మెజార్టీతో గెలుపు



పట్లోళ్ల సబితారెడ్డి మహేశ్వరం ఎమ్మెల్యే

మహేశ్వరం: గత నెల రోజుల నుంచి హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి మూడోసారి విజయం సాధించి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 26,320 ఓట్ల మెజార్టీతో సమీప బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌పైన విజయభేరి మోగించారు. నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్, సరూర్‌నగర్ మండలాలలో సబితారెడ్డి ఆధిక్యత కనబరిచారు. కొన్ని రౌండ్లలో అందెల శ్రీరాములుయాదవ్ పైచేయి సాధించారు. మొత్తం 5,46,577 ఓట్లకు 3,02,576 ఓట్లు పోలయ్యాయి. అందులో బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డికి 1,25,549 ఓట్లు, బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌కి 99,391 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి 70,616, బీఎస్పీ అభ్యర్థి కొత్త మనోహర్ రెడ్డికి 2,767 ఓట్లు పోలయ్యాయి. అందెల శ్రీరాములు యాదవ్‌పైన 26,320 ఓట్ల తేడాతో సబితారెడ్డి గెలుపొందారు. 2009, 2018, 2023 ఎన్నికల్లో మహేశ్వరం నుంచి వరుసగా గెలుపొంది మూడోసారి విజయం సాధించారు.

ప్రజల రుణం తీర్చుకుంటా: సబితారెడ్డి

మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు మూడుసార్లు తనను గెలిపించి ఆదరించినందుకు రుణపడి సేవ చేస్తానని సబితారెడ్డి అన్నారు. విజయం సాధించిన సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడారు. తనపై పూర్తి విశ్వాసం ఉంచి భారీ ఆధిక్యంతో గెలిపించిన ప్రజలందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



ఎమ్మెల్యేగా గెలుపొందిన సబితారెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఆర్ఓ సూరజ్ కుమార్



మీర్‌పేటలో కార్పొరేటర్ అనిల్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు